శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ 13వ వార్షికోత్సవాలు




కమలాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 290 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 14 అక్టోబర్ 2026


## సింగరేణి లాభాల్లో కార్మికుడి వాటా

# రూ.1,53,912

- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 దసరా బోనస్ వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** సింగరేణి బొగ్గు గని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా శుభవార్త అందించింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి రూ. 1,53,912, కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నిర్ణయంతో సింగరేణిలో పనిచేస్తున్న 38,737 మంది శాశ్వత ఉద్యోగులు, 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ప్రయోజనం కలగనుంది. సంస్థ మిగతా2లో...

# ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

- ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగించం: ప్రధాని మోదీ
- బలమైన ఆర్థిక పునాదులు, నిరంతర సంస్కరణలే వృద్ధికి ఆధారం



**న్యూఢిల్లీ: అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్ ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగిస్తూ అభివృద్ధి చెందడం లేదని, ప్రపంచంతో కలిసి, ప్రపంచం కోసం ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై ముందుకు సాగుతోందని, నిరంతర సంస్కరణలు వృద్ధికి దోహదపడుతున్నా యని పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాలు, కీలక సాంకేతిక పరిజ్ఞానాలు, వనరుల కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా మిగతా2లో...

## ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు

పలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




## ఓటు చోరీపై

# ఐక్య పోరాటం

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం ఉధృతం
- ఇండియా కూటమి నేతల సమావేశంలో నిర్ణయం



**న్యూఢిల్లీ,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మిగతా2లో...

## కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత




## హ్యామ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి.. ఇంజినీరింగ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు




**హైదరాబాద్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో చేపడుతున్న హ్యామ్ రహదారుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇంజినీర్స్ భవన్‌లో నిర్వహించిన సంస్థాగత బలోపేత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో హ్యామ్ రహదారుల అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాలు, అమలు తీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7,448 కిలోమీటర్లకు పైగా హ్యామ్ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని, ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. రహదారులు కేవలం ప్రయాణ సౌకర్యాలకే పరిమితం కావని, ప్రజల జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు ఆస్పత్రులకు చేరడం, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందించడం, ప్రజల రాకపోకలు సులభతరం కావడంలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు సరిగా లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు అక్కడ పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్ల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల వేగంతో పాటు నిర్మాణ నాణ్యతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రహదారుల నిర్మాణ బాధ్యతలు చేపట్టిన సంస్థలతో అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగతా2లో...

## 15 ఫీచర్లతో మీసేవా ధ్రువపత్రాలు

- చినిగిపోవు.. తడిసిపోవు.. లామినేషన్ అవసరం లేదు
- కొత్త విధానాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ ఇకపై మీసేవ కేంద్రాల ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలకు లామినేషన్ చేయించాల్సిన అవసరం లేదు. చినిగిపోకుండా, నీటితో తడిసినా త్వరగా దెబ్బతినకుండా ఉండే ప్రత్యేక మిగతా2లో...

## రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే యత్నం!




## జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

- అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ సహా పలువురు కార్యకర్తల నిర్బంధం




**న్యూఢిల్లీ,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా నిరసనలకు వేదికగా నిలిచిన జంతర్ మంతర్‌ను ఆందోళన స్థలాల జాబితా నుంచి

మిగతా2లో...

# ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తోందని మోదీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, విదేశీ మారక నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయని చెప్పారు.పన్నుల విధానం, దివాలా పరిష్కార వ్యవస్థ, కార్మిక చట్టాల్లో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో జీడీపీలో నాలుగు శాతానికి పైగా ఉన్న కరెంట్ అకౌంట్ లోటు ప్రస్తుతం సుమారు అర శాతానికి తగ్గిందని వివరించారు. అనిశ్చితులతో నిండిన ప్రపంచంలో భారత్ విశ్వసనీయత, స్థిరత్వానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.**ఇతరులకు అవకాశాలు కల్పించడమే నిజమైన శక్తి**ఒక దేశానికి ఎంత శక్తి ఉందన్నది మాత్రమే కాకుండా, ఆ శక్తిని ఇతరులకు అవకాశాలు కల్పించేందుకు ఎలా ఉపయోగిస్తుందన్నదే ముఖ్యమని మోదీ అభిప్రాయపడ్డారు. తన అభివృద్ధి విధానాన్ని 'సాధికారత కల్పించే శక్తి'గా అభివర్ణించారు. పోటీ పడటానికే కాకుండా, ఇతరులతో కలిసి పనిచేయడానికి, ఇతరులు కూడా విజయం సాధించేలా సహకరించడానికి శక్తిని వినియోగించాలని సూచించారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, అంకుర సంస్థల విస్తరణ, స్వచ్ఛ ఇంధన సామర్థ్యాలు సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.

డిజిటల్ గుర్తింపు, చెల్లింపులు, ప్రజా మౌలిక సదుపాయాల రంగాల్లో భారత్ సాధించిన అనుభవాన్ని ఇతర దేశాలతో, ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలతో పంచుకుంటున్నామని చెప్పారు.**అంతర్జాతీయ సహకారానికి పిలుపు**సరఫరా వ్యవస్థలు, ఇంధనం, కీలక ఖనిజాలు, చెల్లింపుల వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం వంటివి అంతర్జాతీయ రాజకీయ ఒత్తిడికి సాధనాలుగా మారుతున్నాయని మోదీ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్వసనీయ భాగస్వాములు, సంక్షోభాలను తట్టుకోగల ఆర్థిక వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో భారత పాత్రను విస్తరించడం, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం సాధిస్తున్న పురోగతి భారతదేశానికే పరిమితం కాకుండా, ఇతర దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, పరిష్కారాలను అందించే అవకాశాలను కూడా సృష్టిస్తుందని మోదీ పేర్కొన్నారు.సంస్కరణలు తప్పనిసరి పరిస్థితుల్లో చేపట్టేవి కావని, అవి తమ దృఢ విశ్వాసానికి ప్రతీకలని ప్రధాని స్పష్టం చేశారు.

# ఓటు చోరీపై ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, తేజస్వి యాదవ్, సుప్రియా సూలే, ఎం.ఎ. బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, సంజయ్ రౌత్ తదితరులు హాజరయ్యారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, నిరసనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యక్తీకరణకు వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద నిరసనలను అడ్డుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తామని తెలిపారు.ఎన్నికల సంఘం పనితీరుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.

ఓటర్ల హక్కులను కాపాడేందుకు విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు, ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సీపీఐ నేత డి.రాజా జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించా లని కోరారు. ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు.

# రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే యత్నం!

**జీవో 17ను ఉపసంహరించుకోవాలి..**

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి**

**బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్**

**హైదరాబాద్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతు డిస్కం ఏర్పాటు పేరుతో వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే ప్రయత్నం జరుగుతున్నదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రైతు డిస్కం ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 17ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.రైతులు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు, రంగ నిపుణులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొత్త డిస్కం ఏర్పాటు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, తక్కువ వోల్టేజీ వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త వ్యవస్థతో ఈ సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కొత్త రైతు డిస్కం పరిధిలోకి 30,62,853 విద్యుత్ కనెక్షన్లను బదిలీ చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీటిలో 30,60,861 వ్యవసాయ కనెక్షన్లతో పాటు 512 ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణకు తగిన సిబ్బంది లేకపోతే తలెత్తే సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.కొత్త డిస్కంకు విద్యుత్ కేటాయింపులపైనా హరీశ్‌రావు సందేహాలు వ్యక్తం చేశారు. థర్మల్ విద్యుత్‌లో 25 శాతం, సౌర విద్యుత్‌లో 58 శాతం, జల విద్యుత్‌లో 100 శాతం కేటాయించినట్లు పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రధానంగా పగటిపూటే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఉత్పత్తి కూడా కాలానుగుణంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు.కొత్త డిస్కంకు భారీ మొత్తంలో అప్పులు, బకాయిలను బదిలీ చేయడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వానికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందో వెల్లడించాలని కోరారు. అదనపు పరిపాలనా ఖర్చులు, ఉద్యోగుల బదిలీ, ఆస్తులుఅప్పుల పంపిణీపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నష్టాల పేరుతో భవిష్యత్తులో రైతుల ఉచిత విద్యుత్‌పై ఆంక్షలు విధించే పరిస్థితి రాకుండా స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు.రైతుల అభ్యంతరాలను పరిష్కరించకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లవద్దని హరీశ్‌రావు ప్రభుత్వానికి సూచించారు. రైతు డిస్కం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, విద్యుత్ సరఫరా విధానం, ఆర్థిక నిర్వహణపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగింపుపై భరోసా ఇవ్వలేని పక్షంలో జీవో నంబర్ 17ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

# ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

**తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు**

**పలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**



**హైదరాబాద్:అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించడం తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు అని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కోమటిరెడ్డి భేటీ అయ్యారు. పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు.ఎన్‌హెచ్65 హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను జనవరిలో ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. కృష్ణా నదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అంగీకారం తెలిపారని వెల్లడించారు. తెలంగాణలో ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని ఆదేశించినట్లు చెప్పారు. 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధుల కోసం కేంద్ర అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.హైదరాబాద్అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌హెచ్167కెపై కృష్ణా నదికి అడ్డంగా సోమశిల నుంచి సంగమేశ్వరం వరకు నిర్మించనున్న ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పూర్తయితే తిరుపతి వెళ్లే ప్రయాణికులకు సుమారు 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు. ఈ వంతెనతో పర్యాటక అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదం కలుగుతుందని తెలిపారు.తెలంగాణలో పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న భారతీయ రహదారుల కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారని చెప్పారు. రాష్ట్రం లో రహదారి వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించే ందుకు ఈ సమావేశం దోహదపడుతుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. ఈ భేటీలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

# జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

తొలగించిన మరుసటి రోజే సీజేపీ నేతలు అక్కడికి ప్రవేశించి నిరసన చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున జాతీయ జెండాలను చేతబూనిన కార్యకర్తలు బారికేడ్లు, గేట్లు దాటి జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ అప్పటికే మోహరించిన పోలీసులు సీజేపీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్, అజింక్య షిండేతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు జాతీయ జెండాలు పట్టుకుని 'భారత్ మాతాకీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.**నిరసన హక్కును అడ్డుకోలేరు**జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా తొలగించడం, తమ పార్టీ నేతలను నిర్బంధించడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. జంతర్ మంతర్ కేవలం ఒక ప్రాంతం మాత్రమే కాదని, ప్రజల నిరసన హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. అధికారికంగా నిరసన వేదికను తొలగించవచ్చేమో కానీ, ప్రజల స్ఫూర్తిని అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడాన్ని సీజేపీ నేతల విజయంగా అభివర్ణించారు. దేశంలో నియంతృత్వ ధోరణి కొనసాగుతోందని, పాలకులు నిబంధనలను విస్మరిస్తున్నారని విమర్శించారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):**ఏజెన్సీ ప్రాంతాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎస్టీలకు దక్కాల్సిన 75 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది పోలీసు నియామక బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గిరిజన రిజర్వేషన్లను విస్మరించారని ఆమె ఆరోపించారు. గతంలో 2015, 2018, 2022 నియామకాల్లో ఈ రిజర్వేషన్లు అమలయ్యాయని గుర్తుచేశారు. తాజా నోటిఫికేషన్‌లో మార్పులు చేసి గిరిజన యువతకు న్యాయం చేయాలని కోరారు.ఈ నోటిఫికేషన్ వల్ల ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల గిరిజన అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని కవిత పేర్కొన్నారు. 400కు పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు గిరిజన యువతకు దక్కకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నియామక నోటిఫికేషన్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన యువతతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# సింగరేణి లాభాల్లో కార్మికుడి వాటా రూ.1,53,912

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది పన్నుల అనంతరం రూ.1,754 కోట్ల నికర లాభాన్ని ఆర్జించగా, అందులో 34 శాతం అంటే రూ.596 కోట్లను కార్మికులకు లాభాల వాటాగా పంపిణీ చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య కారణాలతో విధులకు దూరమైన కార్మికులు మెడికల్ బోర్డు కోసం కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆస్పత్రుల్లో ప్రతి నెలా బోర్డు సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 300 వారసత్వ ఉద్యోగ నియామక ఉత్తర్వులు, సంబంధిత న్యాయపరమైన ప్రక్రియలను 15 రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కరోనా సమయంలో విధులకు హాజరుకాలేక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునే అంశాన్ని ఒక్కసారి అవకాశం కల్పించే విధానంలో పరిశీలిస్తామని వెల్లడించారు.కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణికి చెందిన వినియోగంలో లేని భూములను గుర్తించి, అర్హులకు ఇంటి స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. శిథిలావస్థకు చేరిన డీ-టైప్ క్వార్టర్ల స్థానంలో నెహ్రూ కాలనీలను నిర్మించే అంశాన్ని కూడా ప్రస్తావించారు.గనులు, ఓవర్ బర్డెన్ డంప్‌ల నుంచి వెలువడే దుమ్ము వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.సింగరేణి లాభాలు తగ్గడానికి గత ప్రభుత్వ హయాంలో బొగ్గు బ్లాకుల వేలంలో సంస్థ పాల్గొనకపోవడం కూడా కారణమని భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు బొగ్గు బ్లాకులను సాధించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఇంధన శాఖ ఉన్నతాధికారులు, సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# హ్యామ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఒప్పందాలను రద్దు చేసి ఇతర సంస్థలకు పనులు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు.హ్యామ్ రహదారులతో పాటు గ్రామ పంచాయతీ భవనాలు, ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల పనులను నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు అంకితభావంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి జగదీశ్వర్‌తో పాటు పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# 15 ఫీచర్లతో మీసేవా ధ్రువపత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

కాగితంపై వీటిని ముద్రించి అందించనున్నారు. ఇందుకోసం 15 రకాల అధునాతన భద్రతా లక్షణాలతో రూపొందించిన కొత్త విధానాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రజాభవన్‌లో ప్రారంభించారు.నకిలీ ధ్రువపత్రాల తయారీ, అనధికారిక నకళ్లను అరికట్టడమే లక్ష్యంగా ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్టు మంత్రి తెలిపారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ఈ కాగితం సాధారణ వినియోగం, మడతపెట్టడం, దీర్ఘకాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుందని వివరించారు. భద్రతా కారణాల దృష్ట్యా 15 ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించడం లేదని పేర్కొన్నారు.జనన, మరణ ధ్రువపత్రాలతోపాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే పత్రాలు ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమని మంత్రి అన్నారు.

ఈ కొత్త విధానం ద్వారా ధ్రువపత్రాలను ఏళ్ల తరబడి మంచి స్థితిలో భద్రపరుచుకోవచ్చని, ప్రభుత్వ పత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.

# శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ 13వ వార్షికోత్సవాలు

**- మూడో రోజు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణ.. భక్తులకు మహా అన్నదానం**



**ములుగు జిల్లా బందారుపల్లి అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బందారుపల్లి గ్రామంలో శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి 13వ వార్షికోత్సవ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఉత్సవ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. **భక్తిశ్రద్ధలతో మహా అన్నదానం** అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి బందారుపల్లి గ్రామానికి చెందిన బుద్దె వెంకటేశ్వర్లురేవతి దంపతులు సహకారం అందించారు. అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు అన్నప్రసాదం అందించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. **కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణ** ఈ ఉత్సవాలకు ప్రధాన అర్చకులుగా బుసిగొండ సందీపాచార్యులు, ప్రశాంతాచార్యులు వ్యవహరిస్తున్నారు. శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ముద్దసాని మహేందర్, ఉపాధ్యక్షులు కేతే సురేష్, కేశెట్టి నవీన్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు, పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో శ్రీ కనకదుర్గ అమ్మవారి 13వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# బీసీల సంక్షేమానికి రేవంత్ ప్రభుత్వం కట్టుబడి ఉంది: దిడ్డి రాంబాబు

**● బర్కత్‌పురలో నాయీ బ్రాహ్మణ సంఘ ఆత్మీయ కలయిక**




**హైదరాబాద్, అక్టోబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో బీసీ కులాలు, ఉప కులాల సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తెలిపారు. బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తోందని దిడ్డి రాంబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత కుట్టు మిషన్ల పంపిణీతో పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 'చేయూత' పింఛన్లు మరియు స్వయం ఉపాధి రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి మరియు అభివృద్ధికి ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి తగిన న్యాయం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ సంక్షేమ పథకానికైనా దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, నేరుగా సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బి. మాణిక్ రావు, గడ్డం కృష్ణ, రఘు, రాము, జి. శ్రీనివాస్, ఆంజనేయులు, దాస్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవనగర్‌లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**రైతులు పొలాల్లో అక్రమ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దు.. ములుగు ఎస్ఐ బి. చంద్రశేఖర్**



**ములుగు అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ములుగు ఎస్ఐ బి. చంద్రశేఖర్ సూచించారు. ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్ గ్రామంలో మంగళవారం నేరాల నియంత్రణ, గ్రామీణ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సీసీ కెమెరాలు 24 గంటల పాటు మూడో కన్నులా పనిచేస్తూ దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు. కెమెరాల ద్వారా అపరిచిత వ్యక్తుల కదలికలను గుర్తించి, నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే పంట పొలాల్లో అక్రమంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలాంటి కంచెల వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని సూచించారు. దేవనగర్ సర్పంచ్ సలుగు సంతోష్, ఉపసర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# ములుగులో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**- భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ.. సేవా కార్యక్రమంలో పాల్గొన్న బియ్యం వ్యాపారులు**






**ములుగు, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూన్యూస్):** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్‌తో పాటు కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమ్మరెడ్డి హరీష్ తదితర జిల్లా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు సేవ చేయడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. పండుగల వేళ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## కమలాపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో
# రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

**● రెండు నెలలైనా పూర్తికాని కార్డుల పంపిణీ. ● కార్డుల కోసం గ్రామపంచాయతీ చుట్టూ తిరుగుతున్న ప్రజలు. ● పంపిణీ చేయాల్సింది రెవెన్యూ అధికారులే? కొంతమంది డీలర్ల చేతికి కార్డులు? ● ఎమ్మార్వో దృష్టి సారించాలని మండల ప్రజలు విన్నపం.**




**కమలాపూర్ అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ రెండు నెలలైనా పూర్తి కాలేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆహార భద్రత కార్డుల స్థానంలో ఏటీఎం కార్డు సైజులో నూతన స్మార్ట్ రేషన్ కార్డ్ క్యూఆర్ కోడ్ తో డిజిటల్ రూపంలో తయారుచేసి జిల్లా కేంద్రాలకు మూడు నెలల క్రితం అందజేశారు. జిల్లా కేంద్రాల నుండి మండలాలకు గత ఆగస్టు నెలలో చేరవేసి రెవెన్యూ సిబ్బందికి గ్రామాల వారిగా అందజేశారు. ప్రభుత్వం అట్టహాసంగా ఆగస్టు నెలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. కానీ మండల స్థాయిలో ఆశించిన విధంగా కార్డులో పంపిణీ జరగడం లేదు. జిల్లాలో వేలేరు, దామెర మండలాలు కార్డుల పంపిణీలో ముందు వరుసలో ఉన్నారు. కమలాపూర్ మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ పొంతన లేని సమాధానాలు చెప్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు. గ్రామ పంచాయతీల చుట్టూ ప్రజలు ప్రదక్షణలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామ పాలన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ రేషన్ కార్డుల పంపిణీలో ముందు వరుసలో ఉన్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు నిద్రమత్తులో పాలన కొనసాగిస్తూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ ప్రతి రోజు రేపు పంపిణీ చేస్తామని మాయమాటలు చెబుతూ ప్రజలను ఇబ్బంది గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా పాత కాగితాలనే కార్డులుగా వాడుకునే పరిస్థితి కొనసాగుతుంది. పంపిణీ చేయాల్సిన రెవెన్యూ అధికారులు, రేషన్ డీలర్లకు అప్పజెప్పి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కార్డుల పంపిణీ బాధ్యత రెవెన్యూ అధికారులకు అప్పచెప్పింది. కానీ మాకు మండల ఆఫీసులో పని ఉందని పొంతనలేని సమాధానం చెబుతూ రేషన్ డీలర్లకు ఇచ్చి కాలయాపన చేస్తున్న కొంతమంది రెవెన్యూ అధికారుల పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయాలని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదని కానీ అధికారులు పంచినట్టు లెక్కలు చెబుతున్నారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో బతుకమ్మ చీరలు వస్తున్నాయి. స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందో లేదో అని ప్రజలు వాపోతున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజలు సంప్రదించగా డీలర్లకు కార్డుల పంపిణీ బాధ్యత ఇవ్వలేదని, వారి సహకారం మాత్రమే తీసుకున్నామని మా గ్రామ పాలన అధికారులు రెవెన్యూ సిబ్బంది ప్రతి గ్రామంలో పంపిణీ చేస్తున్నారని కొన్ని ముఖ్యమైన పనులు 22 ఏ భూములు, భూభారతి లో రీ సర్వే, సర్ కార్యక్రమం ఉన్నందున ఆలస్యం జరిగిందని అన్నారు. గ్రామ పాలన అధికారులు పంపిణీ కార్యక్రమం పూర్తి చేస్తారని అన్నారు. వెనుకబడిన గ్రామాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్తున్నారు.

# ములుగు బాలికల కబడ్డీ జట్టుకు ఎస్పీ అభినందనలు

**- క్రీడాకారులకు ప్రోత్సాహం.. జాతీయస్థాయి క్రీడాకారులకు ఘన సన్మానం**



**ములుగు అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో నిర్వహించిన 52వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో ములుగు జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచింది. టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన బాలికలు, ప్రీ క్వార్టర్ ఫైనల్‌లో ఖమ్మం జట్టుతో హోరాహోరీగా తలపడి కేవలం ఒక్క పాయింట్ తేడాతో ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ, వారి పోరాట పటిమను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పోలేపాక జనార్దన్, అసోసియేషన్ సభ్యులు జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్. కేకన్‌ను కలిసి క్రీడాకారుల ప్రదర్శనను వివరించారు. బాలికల ఆటతీరును ఎస్పీ అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు తన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. జాతీయస్థాయిలో పాల్గొన్న జోగు శేషు, జాతీయ బాలికల కబడ్డీ శిబిరానికి ఎంపికైన పరమేశ్వరిని శాలువాలతో సన్మానించి, క్రీడాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందించిన పత్తిపల్లి ఉపసర్పంచ్ పోరిక బద్రు నాయక్‌ను కూడా శాలువాతో సత్కరించి అభినందించారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎస్పీకి ములుగు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

# రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలి

**• వ్యవసాయ విద్యుత్ అంతరాయాలను నివారించాలి: గుంజపడుగు హరిప్రసాద్**



**కరీంనగర్, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):**
రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిం చాలని తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భ ంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నందున, విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే పంటలకు నీరు అందక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, పంటలను కాపాడాలని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ, రైతులకు నిరంతర విద్యుత్ అందిస్తున్నామనే ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ సరఫరా సమయాలు, నాణ్యతపై అధికారులు పర్యవేక్షణ పెంచాలని, రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి అంకం శివరాణి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ ముదిరాజ్, తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పరిశీలకుడిగా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్

**- గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు బాధ్యతలు**



**(డోర్నకల్, అక్టోబర్ 13 పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరగబోయే తెలంగాణ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియ పర్యవేక్షణకు డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌ను పరిశీలకుడిగా (అబ్జర్వర్) నియమించారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పరిశీలకులు సంబంధిత జిల్లాల్లోని నాయకులు, భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలు, ఆశయాలకు అనుగుణంగా అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు అయ్యేలా ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ నియామకంతో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమంలో డాక్టర్ రామచంద్ర నాయక్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. నియామక ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సంబంధిత ఆదేశాల్లో పేర్కొన్నారు.

# రీసర్వే పనులు పారదర్శకంగా చేపట్టాలి

**- రైతుల సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్**



**కల్లూరు, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండలంలోని రఘునాథగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే (రీసర్వే) పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును పరిశీలించి, రైతులతో మాట్లాడి రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భూ పునఃసర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలని, భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# రీసర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలి**

**రీసర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకంగా భూ వివరాల నమోదు**





**కల్లూరు, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**జిల్లాలో భూముల రీసర్వే పనులను పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామం, కల్లూరు మండలం రఘునాథగూడెం రెవెన్యూ గ్రామం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు రీసర్వే పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రోజువారీ పురోగతిని సమీక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట తల్లాడ, పెనుబల్లి, కల్లూరు తహశీల్దార్లు కె. కరుణాకర్ రెడ్డి, జి. వీరభద్ర నాయక్, కె. బ్రహ్మేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా అంకిత భావంతో పనిచేయాలి

**- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**



**సత్తుపల్లి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి అని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. రైతులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సహాయక చర్యలు తక్షణమే అమలు చేయాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లి లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సత్తుపల్లి పట్టణ, మండల మరియు వేంసూరు మండల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకుని అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రుల్లో అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కరువు మండలాల ప్రకటన, ఉపాధి హామీ పనిదినాల పెంపు వంటి అంశాల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులకు, గ్రామీణ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, కేటీపీఎస్, మణుగూరు థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని సమర్థవంతంగా నిర్వహిం చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శిం చారు. సింగరేణి బొగ్గు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కల్లూరు, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. పూల బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం సంతోషకరమని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ పండుగలను సమిష్టిగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, మహిళల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవ్, యాస నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోట్రూ అర్జున్ రావు, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, బైర్ల కాంతారావు, ఆలకుంట నరసింహారావు, జిల్లెల్ల కృష్ణారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, కంభంపాటి పుల్లారావు, రామారావు, వార్డు అధికారులు సరోజిని, తనుజ, సుధారాణి, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి..

**- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్..**





**కరీంనగర్, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరుతూ ఫోరం ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో త్యాగాలు చేశారని, వారి పోరాట ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని నాయకులు పేర్కొన్నారు. అయితే ఉద్యమకారులకు అందాల్సిన గౌరవం, సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు.ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, వారికి ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరం

**కరీంనగర్, అక్టోబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న విజన్ వీక్ ఆఫ్ సర్వీస్ (విసియాన్ వీక్ ఆఫ్ సర్వీస్) కార్యక్రమంలో భాగంగా, లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం సంయుక్తంగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఉటూర్ గ్రామంలో ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించాయి.క్లబ్ ట్విన్నింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించడంతో పాటు, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, దృష్టి లోపాలను ముందుగానే గుర్తించడం, నివారించగల అంధత్వాన్ని అరికట్టడం ప్రధాన లక్ష్యాలుగా చేపట్టారు. శిబిరంలో గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ చైర్మన్ పెద్ది విద్యాసాగర్ నాయకత్వం వహించగా, కోఆర్డినేటర్ ముద్దసాని ప్రదీప్ రెడ్డి , సింగమరాజు, కోల అన్న రెడ్డి, వెంకటాద్రి, డా. తుంగూరి కార్తీక్ పాల్గొని తమ సేవలను అందించారు.శిబిరానికి అవసరమైన మందులను స్వస్తిక్ మెడికల్ ఏజెన్సీస్ ద్వారా నర్ల సాయి కృష్ణ స్పాన్సర్ చేశారు. వారి సహకారం ద్వారా శిబిరానికి హాజరైన రోగులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తోడ్పాటు లభించింది.







లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షులు మ్యాడం శివకాంత్ పటేల్, ముక్క శరత్ కృష్ణ, బట్టు వినోద్ పటేల్, మెతుకు కృష్ణ చైతన్య, ఐత సూరజ్ కుమార్, కంభం ప్రసాద్ ఈ సేవా కార్యక్రమానికి తమ సహకారాన్ని అందించారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం, కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను విస్తరించడం లయన్స్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. లయన్స్ ఇంటర్నేషనల్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

## బిజెపి సీనియర్ కార్యకర్త పబ్బ తిరుపతిని ఫోన్‌లో పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, అక్టోబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త, బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తూ ఆటో పై నుండి కిందపడటంతో ఆయన కాలు తీవ్రంగా గాయపడి ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ పవిత్రమైన భవానీ దీక్షలో ఉండి కూడా, కార్యకర్త సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించడం, ఆయనకు కార్యకర్తలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి ధైర్యం చెప్పడం అభినందనీయమని, ఈ విషయంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు తిమ్మాపూర్ మండల బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

## పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్‌లను కలిసిన ఎంఐఎం ప్రతినిధి బృందం

**- నూతన టౌన్ కమిటీ పరిచయం..**
**నగర సమస్యల పరిష్కారంపై చర్చ**

**కరీంనగర్,అక్టోబర్13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ ఎంఐఎం టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ అతీఫుద్దీన్ అతీనా నేతృత్వంలో టౌన్ కమిటీ ప్రతినిధి బృందం జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన ఎంఐఎం టౌన్ కమిటీ సభ్యులను ఇరువురు అధికారులకు పరిచయం చేశారు. అనంతరం నగరంలో నెలకొన్న వివిధ ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన





చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నూతన కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎంఐఎం ప్రతినిధి బృందం ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్, ఎంఐఎం నాయకుడు మహమ్మద్ అబ్బాస్ సమీ, టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ మొహసిన్ ఉద్దీన్, సహాయ కార్యదర్శి సయ్యద్ బరకత్ అలీ, సయ్యద్ ఖమరుద్దీన్, మహమ్మద్ అజర్ ఉద్దీన్ దబీర్, మహమ్మద్ రషీద్ బాజ్ ఖాన్, కార్పొరేటర్లు ఇబ్రహీం బియాబానీ, మహమ్మద్ మాజిద్ హుస్సేన్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మహమ్మద్ నజీబ్ ఉర్ రెహమాన్, మహమ్మద్ అబ్దుల్ ఖాలిక్, మహమ్మద్ జాఫర్, సయ్యద్ అలీ, సయ్యద్ మతీన్, మహమ్మద్ అక్రముల్లా ఖాన్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, రిజ్వాన్ ఉల్లాఖాన్, మహమ్మద్ రఫీకుద్దీన్ బాబా, యాకూబ్ షేక్ సమీ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కండి...

- **సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలన్ని విజయవంతంగా పూర్తి చేయాలి...**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ...**



**కరీంనగర్, అక్టోబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 17వ తేదీతో 'సేవా సంకల్ప్ అభియాన్' ముగియనున్న నేపథ్యంలో, పార్టీ నిర్దేశించిన ప్రోగ్రాంలన్నీ విజయవంతంగా పూర్తి చేసేలా, రాబోయే 50 రోజుల పాటు ప్రజా సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించేలా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య నేతల సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజున కరీంనగర్లోని మహాశక్తి దేవాలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సాయి ని మల్లేశం మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని,అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని కోరారు.ఈ నెల 17 తర్వాత రాబోయే 50 రోజుల పాటు అనుసరించాల్సిన వివిధ కార్యక్రమాలు, ఆందోళనలు, ధర్నాలపై నేతలకు స్పష్టమైన ప్రణాళికను వివరించారు.కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి చేపట్టబోయే కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, కన్న కృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, వైదరామానుజం, చేపూరి సత్యం, శ్రవణ్ , ముత్యాల జగన్ రెడ్డి , గుంజేటి శివకుమార్, మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ లతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్ , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు నివాసంలో బతుకమ్మ సంబరాలు..



**బతుకమ్మ పాటలు పాడుతూ**
**బతుకమ్మను పేర్చి , ఆడి పాడిన**
**బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు..**
**తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలకు చీర**
**సారే తో ఘనంగా సత్కరించిన**
**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర..**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ ఘనంగా జరుగుతున్న సంబురాల్లో పాల్గొనేందుకు ఖమ్మం చేరుకున్న బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సాధర స్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసానికి చేరుకున్న ఆడబిడ్డలు.. స్వయంగా పాటలు పాడుతూ, సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ పేర్చారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ విప్ గొంగడి సునితా రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మాజీ కార్పొరేషన్ చైర్ పర్సన్లు రజినీ సాయిచంద్, మంత్రి శ్రీదేవి, వద్దిరాజు అనీల పలువురు మహిళల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దగ్గరుండి మహిళ నేతలకు పూలు, పూజా సామాన్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అందజేశారు. సోదరీమణులు పాటలు పాడుతూ బతుకమ్మలు పేరుస్తుంటే రవిచంద్ర సాయం అందించారు. అనంతరం వద్దిరాజు రవిచంద్ర నివాసంలో బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు బృందం బతుకమ్మ ఆడారు. తన ఇంటికి విచ్చేసిన మహిళా సోదరీమణులందరినీ సాదరంగా ఆహ్వానించిన వద్దిరాజు కుటుంబ సభ్యులు.. వారిని చీర సారె తో సత్కరించారు.

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద సెక్యూరిటీ ప్రాధాన్యత ఇవ్వాలి

**- పోలీస్ కమిషనర్ సునీల్ దత్**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బ్యాంకులు, ఏటీఎంల వద్ద సేఫ్టీ అండ్ సెక్యూరిటీ కి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, బ్యాంకుల అధికారులతో మంగళవారం సమన్వయ సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...ఇటీవల కాలంలో ఏటియం, బ్యాంకుల వద్ద ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ బ్యాంకు ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డ్, సీసీ కెమెరాలు, అలారం సిస్టంను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవడంతో పాటు పర్యవేక్షణ ఉండాలని బ్యాంకుల అధికారులకు సూచించారు.ఏటీఎం వద్ద పోలీస్ గస్తీ విధిగా ఉంటుందని అన్నారు. నేరం జరిగినప్పుడు వచ్చే అలర్ట్ అలారం సిస్టమ్ ను పోలీస్ స్టేషన్ కు, పోలీస్ కామాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేసే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. ఏటియం సెంటర్ల బ్యాంకు లోపల, బయట పరిసర ప్రాంతాల్లో అనుమానస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు, వారి ప్రవర్తనను సెక్యూరిటీ గార్డులు నిరంతరం గమనించాలని సూచించారు. ఏటీఎంలో నగదు నింపే సమయంలో భద్రతను మరింత పటిష్టం చేయాలని అన్నారు. బ్యాంకు సిబ్బందికి తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్ అధికారుల ఫోన్ నెంబర్లు తెలిసి ఉండాలని, హెల్ప్‌లైన్, పోలీస్‌స్టేషన్ నెంబర్లను స్పష్టంగా కనిపించే విధంగా బ్యాంకుల్లో ఏర్పాటు చేయాలన్నారు. అనుమానం వచ్చిన వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. బ్యాంకులు, ఏంటీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు.

బ్యాంకు అధికారుల విన్నపాలను, సూచనలను పరిగణలోకి తీసుకోని అవసరమైన సహాయసహకారం అందిస్తామని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, లిడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఏసీపీలు పాల్గొన్నారు.

# ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల యాత్రను విజయవంతం చేయాలి

**• అర్థిక ఆధారిత పోరాట సమితి కో ఆర్డినేటర్ సంధి తిరుపతి రెడ్డి**



**కరీంనగర్, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కులాలకు అతీతంగా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కోసం అక్టోబర్ 24 న సాయంత్రం 4-00 గంటలకు కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న రథ యాత్ర ను విజయవంతం చేయాలని ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ సంధి తిరుపతి రెడ్డి కోరారు. మంగళవారం వేములవాడ మండలం లో ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల పోరాట సమితి ప్రతినిధులు నరేడ్ల రాఘవ రెడ్డి, పాశం నారాయణ రెడ్డి లతో కలసి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుక బడిన వారికి" కులాలకతీతంగా రిజర్వేషన్ ఇవ్వాలని " ప్రవీణ్ అరోరా " అనే సామాజిక కార్యకర్త నాయకత్వం లో "ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ జాగరుక రథయాత్ర డిల్లీ నుండి వస్తుందనీ, ఇట్టి రథయాత్రకు మద్దతుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో వేలాది మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# భరత్‌నగర్‌లో వైభవంగా రేణుకా ఎల్లమ్మజమదగ్ని కల్యాణ మహోత్సవం!

**- జై భగవాన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు**

**- బొమ్మిడి వినోద్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా వేడుకలు**

**- 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ.. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు**





**ఉప్పల్, అక్టోబర్ 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ భరత్‌నగర్‌లో జై భగవాన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొమ్మిడి వినోద్ రెడ్డి నేతృత్వంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మజమదగ్ని కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. అనంతరం సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలుకల్యాణ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బొమ్మిడి వినోద్ రెడ్డి మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాల్లో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ సభ్యుడు చిలుగూరి శ్రీకాంత్ మాట్లాడుతూ, అమ్మవారి పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి వినోద్ రెడ్డి, స్వాతి దంపతులతో పాటు నరేష్ బోనం, ఓగ్గు నాగరాజు, ప్రేమ్, అవినాష్, రాజిరెడ్డి, సంపత్, డప్పు రవి, బాబు, యశ్వంత్, నిఖిల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా తాటిపల్లి రాజన్న



**కరీంనగర్, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ వాణిజ్య సెల్ అధ్యక్షుడిగా జమ్మికుంటకు చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య నాయకుడు తాటిపల్లి రాజన్న నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వాణిజ్య వర్గాల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, డాక్టర్ మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు రాజన్న కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాజన్న నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# దసరా సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

**- గంగాధర ఎస్సై వంశీకృష్ణ సూచన**



**గంగాధర, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** దసరా సెలవుల సందర్భంగా కుటుంబాలతో కలిసి ఊళ్లకు వెళ్లేవారు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గంగాధర ఎస్సై వంశీకృష్ణ సూచించారు. ఇంటి ప్రధాన ద్వారాలు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. ఇంటికి తాళం వేసి వెళ్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిర్గతం చేయకూడదని, నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించుకోవాలని, పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై వంశీకృష్ణ సూచించారు.

# వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

**- శ్రీనగర్ కాలనీలో భక్తిపారవశ్యం**

**- భక్తులకు మహా అన్నదానం**





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నగరంలోని శ్రీనగర్ కాలనీలో హనుమాన్ సింగ్ నివాసంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ వేడుక మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా సాగింది. గురుస్వామి గొలుసుల తిరుమలరావు ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేట అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో మాలధారణ అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వామి తిరుమలరావు పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛారణల మధ్య పడిపూజను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన అయ్యప్ప స్వాములకు, భక్తులకు ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విచ్చేసిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రసాదాన్ని స్వీకరించారు. అయ్యప్ప నామస్మరణతో శ్రీనగర్ కాలనీ ప్రాంతం మార్మోగింది. గురుస్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చింతకాయల అంజయ్య, తాడబోయిన రాంబాబు, బరిగల శేఖర్, కట్ల నరసింహారావు, బార్ అనిల్, బండి మనోజ్, ఐతనబోయిన వెంకట్రావు, ఏటుకూరు నవీన్, లక్ష్మణ్, కూచిపూడి మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ఏఐఎంఐఎం లక్ష్యం

**- పోలీస్, మున్సిపల్ కమిషనర్లతో టౌన్ బాడీ నేతల భేటీ**





**కరీంనగర్, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర ప్రజల సమస్యల పరిష్కారం, పౌర సంక్షేమం, నగర అభివృద్ధి లక్ష్యంగా ఏఐఎంఐఎం టౌన్ బాడీ ప్రతినిధులు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, కరీంనగర్ ఇన్‌చార్జి యాసర్ అర్ఫత్ మార్గదర్శకత్వంలో ఈ భేటీ జరిగింది. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం, అధికారులతో సమన్వయంపై చర్చించారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, టౌన్ ప్రెసిడెంట్ ఆతీఫ్ అతీనా, ప్రధాన కార్యదర్శి మొహ్సిన్ మొహియుద్దీన్, సంయుక్త కార్యదర్శులు సయ్యద్ బర్కత్ అలీ, అజర్ దబీర్, ఖుర్షీద్, ఖమర్, 59వ డివిజన్ కార్పొరేటర్ మజీద్ హుస్సేన్, కోశాధికారి సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఏఐఎంఐఎం నాయకులు తెలిపారు. ప్రజా సేవ, ఐక్యత, అభివృద్ధి, జవాబుదారీతనంతో నగర ప్రజల పక్షాన నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు.

# తీవ్ర రక్తహీనత బాధితులందరికీ క్షేత్రస్థాయిలో చికిత్స అందించాలి

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ధనాలకోట రామారావు**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన తీవ్ర రక్తహీనత బాధితులకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలు, తక్షణ చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ధనాలకోట రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని తీవ్ర రక్తహీనత కేసుల సమగ్ర జాబితా ప్రకారం, బాధితులందరినీ వారి ఇళ్ల వద్దనే క్షేత్రస్థాయి సిబ్బంది (వైద్యాధికారులు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు) తప్పనిసరిగా సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బాధితులందరికీ తక్షణమే వైద్యుల పర్యవేక్షణలో తగిన చికిత్స ప్రారంభించాలన్నారు. చికిత్స ప్రారంభించిన కేసుల వివరాలను ఏ రోజుకారోజు నిర్దేశిత ట్రాకింగ్ (గూగుల్) షీట్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏ ఒక్క కేసు కూడా నమోదు కాకుండా ఉండకూడదని, వివరాల నమోదులో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. బాధితులు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పకుండా వాడేలా క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. పోషకాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, బడికి వెళ్లే విద్యార్థుల, కిశోర బాలికలలో రక్తహీనతను అరికట్టడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను విజయవంతం చేయాలని, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని డిఎం అండ్ హెచ్ఓ పిలుపునిచ్చారు.



# మధ్యవర్తిత్వంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం







**పత్తికొండ అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** సుదీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతగానో దోహదపడుతుందని ప్యానెల్ న్యాయవాది సూరజ్ నబీ, మధ్యవర్తిత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని స్టేట్ బ్యాంక్, ఆదోని రహదారి ప్రాంతాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించుకోవచ్చో వివరించడంతో పాటు, ప్రజలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, ఇరుపక్షాల మధ్య పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోదగిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కేసుల పరిష్కారానికి ఇరుపక్షాల కక్షిదారులకు న్యాయస్థానం ద్వారా ఉచిత మధ్యవర్తిత్వ న్యాయవాదుల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆర్. శ్రీనివాస్ నాయక్, న్యాయవాది మదన్ గోపాల్ గౌడ్, లోక్ అదాలత్ ప్రతినిధి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నిత్య పూజేశ్వరుని తలనీలాల వేలం రూ.4.84 లక్షలు

**సిద్ధవటం అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర స్వామివారి కార్తీక మాస తలనీలాల వేలంపాట రూ.4,84,000లకు ప్రొద్దుటూరుకు చెందిన మునిశేఖర్ దక్కించుకున్నారు. మంగళవారం సిద్ధవటంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ప్రొద్దుటూరు, గుంతకల్, చాపాడు, వంతాటిపల్లి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. దేవస్థానం నిర్ణయించిన రూ.3 లక్షల కనీస ధరను అధిగమించి, మునిశేఖర్ అత్యధికంగా రూ.4.84 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు కార్తీక మాసంలో భక్తులు స్వామివారికి మొక్కుబడిగా సమర్పించే తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకవర్గ సభ్యుడు శివారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన తండా వద్ద బస్సు ఆపలేదని డ్రైవర్‌పై ఆరోపణలు

- మహిళా ప్రయాణికురాలితో దురుసు ప్రవర్తన.. డ్రైవర్ గోపాల్‌ను సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల డిమాండ్
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ స్పందన.. విచారణకు ఆదేశాలు



**మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 13 (పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(సి) గ్రామ శివారు కందికొండ స్టేజీ వద్ద ఆర్టీసీ డ్రైవర్ గోపాల్ వ్యవహారశైలి వివాదానికి దారితీసింది. గిరిజన తండా వద్ద బస్సు ఆపాలని కోరిన మహిళా ప్రయాణికురాలితో డ్రైవర్ దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. కురవి మండలం కొత్తూరు(సి) శివారులోని గుజిలితండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యురాలు జాటోత్ సుజాత మరిపెడలో బస్సు ఎక్కారు. తన తండా వద్ద బస్సు ఆపాలని డ్రైవర్ గోపాల్‌ను కోరగా, "మీ గిరిజన తండా దగ్గర బస్సు ఆపను" అంటూ నిరాకరించినట్లు ఆమె ఆరోపించారు. కందికొండ స్టేజీ వద్ద సుమారు 30 నిమిషాలపాటు బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో సుజాతకు, డ్రైవర్‌కు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, "నీ సంగతి తెలుసు" అంటూ డ్రైవర్ బెదిరింపు ధోరణిలో మాట్లాడినట్లు బాధితురాలు ఆరోపించారు. కండక్టర్ బస్సును అక్కడే ఆపి ప్రయాణికులను దింపాలని సూచించినప్పటికీ డ్రైవర్ అంగీకరించలేదని ఆమె వర్గాలు పేర్కొన్నాయి. దీంతో గిరిజన మహిళలు బస్సు దిగి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న గుజిలితండాకు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. డ్రైవర్ గోపాల్ గతంలోనూ మహిళా ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించేవారని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. **విచారణకు ఆదేశించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు** గిరిజన మహిళా ప్రజాప్రతినిధి జాటోత్ సుజాతతో డ్రైవర్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి రావడంతో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ స్పందించినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. **డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి** గిరిజన మహిళా ప్రయాణికురాలితో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డ్రైవర్ గోపాల్‌పై ఆర్టీసీ అధికారులు విచారణ జరిపించాలని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే డ్రైవర్‌ను సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రయాణికుల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రజా రవాణా సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, గిరిజన మహిళలకు గౌరవం, ప్రయాణికులకు భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం..

- రాజ్యాంగం కల్పించిన హక్కులను ఖూనీ చేస్తున్న బిజెపి..
- మరో స్వాతంత్ర్య పోరాటానికి విద్యార్థులు యువకులు సన్నద్ధం కావాలి.
- ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర జిఎస్టి కార్యాలయం ముట్టడి
- ఉద్రిక్తత విద్యార్థి యువజన సంఘాల నాయకుల అక్రమ అరెస్ట్..







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశ ప్రజలు ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్రం ఉద్యమాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితుల ఆధ్వర్యంలో స్థానిక వీడియోస్ కాలనీలోని కేంద్ర జిఎస్టి కార్యాలయం ముట్టడి, ఉద్రిక్తత, విద్యార్థి యువజన సంఘాల నాయకుల అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్కు తరలింపు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బిజెపి ఏజెంట్గా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతోని సర్ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించడం రాజ్యాంగం ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఢిల్లీలో ఓట్ల చోరీని నిరసిస్తూ శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా ధర్నా చేస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సోదర వామపక్ష పార్టీలు, వామపక్షా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర వాదులును, అక్రమ అరెస్టులు చేయడం రాజ్యాంగ హక్కులను హరించడమే అన్నారు. ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కే ప్రయత్నం తగదన్నారు. తక్షణమే జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరో స్వాతంత్ర్య ఉద్యమం తలపిస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, బూర మనోజ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ శ్రీనాథ్ రెడ్డి. ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, జిల్లా నాయకులు కిరణ్ ఉమా భీమేష్ భాను. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉగ్గం సురేష్. సందేశ్ పవన్ గణేష్ కోటి, సమీర్, తేజ, ఉదయ్, నరేందర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ...శాఖంబరీదేవి.... పాహిమాం...

- కరువు తీరగ రావే మా తల్లీ
- అన్నపూర్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- శాఖంబరీ దేవికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు
- వేలాది భక్తులతో కిటకిటలాడిన మహాశక్తి ఆలయం
- దాండియా డ్యాన్సులతో అధ్యాత్మిక సాగరంలో మునిగిన యువత









**కరీంనగర్, అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ లోని చైతన్యపురి శ్రీ మహాశక్తి ఆలయంలో నిర్వహించిన దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం శ్రీ అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అమ్మవారిని అన్ని రకాల కూరగాయలు, పండ్లతో శాఖంబరీ దేవీగా అలంకరించారు. శాఖంబరీ దేవీ అవతారంలో అమ్మవారిని చూసిన భక్తులు ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీ అన్నపూర్ణ దేవిని దర్శించుకోవడంతోపాటు భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు సరిగా కురవక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో "శ్రీ అన్నపూర్ణదేవి... శాఖంబరీ....పాహిమాం..పాహిమాం. ప్రతి ఇంటా సిరుల మాగాణి పండించు తల్లీ"అంటూ వేడుకోవడం గమనార్హం. **శాకంబరీదేవి.. ప్రకృతే పరమేశ్వరి!** శాకంబరీదేవి రూపం ప్రకృతి వైభవానికి, ఆహార భద్రతకు, సకల జీవరాశిపై అమ్మవారి కరుణకు ప్రతీక. 'శాకం' అంటే ఆకుకూరలు, కూరగాయలు వంటి వృక్షసంబంధ ఆహార పదార్థాలు. వాటిని ప్రసాదించే దేవతగా శాకంబరీ మాతను భక్తులు ఆరాధిస్తారు. దుర్గాదేవి స్వరూపమైన ఈ అమ్మవారి ఆరాధనలో పచ్చని ప్రకృతికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ నేపథ్యంలో మహాశక్తి ఆలయంల్ శాకంబరీదేవి అలంకరణలో అమ్మవారిని తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, వివిధ రకాల పూలతో అత్యంత వైభవంగా అలంకరించారు. పచ్చని ఆకులు, రంగురంగుల కూరగాయలు, పండ్లతో అమ్మవారి సన్నిధి ఒక అందమైన ప్రకృతి వనంలా కనువిందు చేసింది. కూరగాయలతో అలంకరించిన అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు ప్రకృతి ప్రసాదించే సంపదగా కీర్తించారు. పంటలు పండించే రైతుల కష్టాన్ని, వర్షాలు కురిపించే ప్రకృతి గొప్పదనాన్ని, ఆహారం అందించే నేల విలువను గుర్తుచేసుకున్నారు. ఎల్ నినో నేపథ్యంలో తెలంగాణ మాగాణి లో కరువు లేకుండా ప్రతి ఇంటా సిరుల మాగాణి పండించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నపూర్ణ దేవిని ప్రార్థించడం విశేషం. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీ మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా దాండియా నిర్వహించారు. వేలాది మంది భక్తుల ముఖ్యంగా యువత దాండియాలో పాల్గొని శ్రీ అన్నపూర్ణ దేవిని కీర్తిస్తూ డ్యాన్సులు వేయడం విశేషం.

# పులివెందుల అర్బన్ పీఎస్ కమాండ్ కంట్రోల్ హెల్ప్‌లైన్ ప్రారంభించిన ఎస్పీ

- ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయమే లక్ష్యం
- కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్




**పులివెందుల అక్టోబర్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు రక్షణ,సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 9490864264 ను వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ, ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో లేదా సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా ఈ నంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ప్రతి కాల్‌పై సిబ్బంది వెంటనే స్పందించి,క్షేత్రస్థాయిలో బాధితులకు తగిన సహాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రాధాన్యత అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్ అర్బన్ సీఐ పురుషోత్తం రాజు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రణ్‌బీర్ 'రామాయణ' నుంచి
# జటాయువు పోస్టర్




రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ: పార్ట్-1' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'జటాయువు' పాత్రకు సంబంధించిన తొలి పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ ఈ పాత్రకు తన గొంతును అందించనున్నారు. 'ది వింగ్స్ ఆఫ్ ధర్మ' (ధర్మ రెక్కలు) పేరుతో విడుదలైన పోస్టర్‌లో జటాయువు తీక్షణమైన చూపులు ఆకట్టుకుంటున్నాయి. మరో దృశ్యంలో ఆ భారీ పక్షి రెక్కలు విప్పి కనిపిస్తోంది. ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకున్న చిత్రబృందం.. రావణుడు సీతను అపహరించినప్పుడు అతడిని ఎదిరించేందుకు జటాయువు చూపిన ధైర్యాన్ని గుర్తుచేసింది. విజయం కోసం కాకుండా ధర్మం కోసం పోరాడిన వీరుడిగా జటాయువును అభివర్ణించింది. సినిమా ప్రచారంలో భాగంగా ఇప్పటికే పలు పాత్రల పోస్టర్లను విడుదల చేయగా.. తాజాగా జటాయువు పోస్టర్‌ను పరిచయం చేసింది.నితేశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవిదూబే నటిస్తున్నారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్.. డీఎన్ఈజీ, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.'రామాయణం' తొలి భాగాన్ని 2026 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమా విడుదల కానుంది.ఇటీవల ముంబైలో నిర్వహించిన ప్రచార కార్యక్రమానికి అంతర్జాతీయ యూట్యూబర్ మిస్టర్ బీస్ట్ హాజరయ్యారు. రణ్‌బీర్, సాయిపల్లవి, నిర్మాత నమిత్ మల్హోత్రా కూడా పాల్గొన్నారు. అయితే కార్యక్రమం సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో మీడియా ప్రతినిధుల నుంచి విమర్శలు వచ్చాయి.ఇదిలా ఉండగా, శ్రీరాముడి పాత్ర కోసం రణ్‌బీర్ మాంసాహారం, మద్యానికి దూరంగా ఉన్నారంటూ వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ మార్పులన్నీ ప్రత్యేకంగా సినిమా కోసమే చేశారనే విషయంపై స్పష్టత లేదు. ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే ప్రయత్నంలో భాగంగా శాకాహారాన్ని స్వీకరించడం, మద్యం, ధూమపానాన్ని మానేయడం గురించి రణ్‌బీర్ గతంలో మాట్లాడారు.

# శ్రీవారి సన్నిధిలో 'రణబాలి' జంట.

## విజయ్, రష్మిక ప్రత్యేక పూజలు



టాలీవుడ్ క్రేజీ పెయిర్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా తమ కొత్త చిత్రం 'రణబాలి' విడుదల సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీరిద్దరూ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'రణబాలి' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుండగా, దానికి ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.
సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి వచ్చిన విజయ్, రష్మిక ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దర్శనం అనంతరం వారు హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం.'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత విజయ్-రష్మిక జంటగా నటిస్తున్న మూడో చిత్రం కావడంతో 'రణబాలి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఇప్పటికే విడుదలైన పాటలు, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం ఈ నెల 16న దసరా పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకు పలు ప్రత్యేకతలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దీనిని తెరకెక్కింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషించడం సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తోంది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు.ప్రస్తుతం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన చిత్ర బృందం, ఈరోజు ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో ప్రేక్షకుల్లోకి సినిమాను మరింతగా తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. అయితే, దేశవ్యాప్తంగా సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# యంగ్ బ్యూటీకి పాన్ ఇండియా జాక్ పాట్!



నాలుగేళ్ల క్రితం కన్నడ సినీపరిశ్రమ నుంచి అద్భుతమైన జానపద కథతో బ్లాక్ బస్టర్ సినిమా వచ్చింది. ఆ తర్వాత 2025లో వచ్చిన ప్రీక్వెల్ కూడా బంపర్ హిట్టు కొట్టి ఆ హీరో, నిర్మాణ సంస్థలకు గొప్ప ఆదాయం, అంతకుమించిన పేరును కూడా తెచ్చిపెట్టింది. కేజీఎఫ్ తర్వాత అదే స్థాయిలో వరుస పెట్టి పాన్ ఇండియా విజయాలు దక్కడంతో కన్నడ పరిశ్రమలో కొత్త జోష్ కూడా వచ్చింది. ఆ తర్వాత చాలా మంది వరుసగా పాన్ ఇండియా సినిమాలు ట్రై చేస్తూనే ఉన్నారు.
ఇదిలా ఉంటే పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ సంగతి ఎలా ఉన్నా.. ఆ ఫ్రాంఛైజీలో నటించిన హీరోకి, నిర్మాణ సంస్థకు మధ్య వివాదాలు సద్దుమణగలేదన్న చర్చ వేడెక్కించేస్తోంది. బాలీవుడ్ లో కరణ్ జోహార్- కార్తీక్ ఆర్యన్ ఇష్యూలా ఈ ఇష్యూ కూడా ఏదో ఒక రోజు సెటిలయ్యేదే. కానీ ఇప్పటికీ ఇంకా వారి మధ్య పొరపొచ్చాలు తగ్గలేదని గుసగుస వినిపిస్తోంది. బ్లాక్ బస్టర్ ప్రీక్వెల్ చాప్టర్ 1 విడుదలై ఇప్పటికి ఏడాది పూర్తి కాగా.. నిర్మాణ సంస్థ పేరును మెన్షన్ చేయకుండా హీరో, అలాగే హీరో పేరును ప్రస్థావించకుండా నిర్మాణ సంస్థ సోషల్ మీడియాల్లో వార్షికోత్సవ పోస్టును షేర్ చేయడంతో వారి మధ్య ఇంకా ఏదీ సెట్ రైట్ కాలేదని అర్థమైంది. అలాగే అదే చిత్రంలో నటించిన హీరోయిన్ కి, హీరోకి మధ్య కూడా కొన్ని విభేధాలొచ్చాయని.. వారి మధ్య కూడా మాటల్లేవనే ప్రచారం అప్పట్లో సాగింది. సరిగ్గా ఇదే కారణంతో తెలుగులో బ్లాక్ బస్టర్ ఫ్రాంఛైజీలో తన సరసన ఆ హీరోయిన్ నటించాల్సి ఉన్నా ఆ హీరో అవకాశం కల్పించలేదని గుసగుస వినిపిస్తోంది. ఇలాంటి సమయంలోనే వరుస హిట్లతో దూసుకుపోతున్న మమిత భైజుతో రీప్లేస్ చేసారని తెలుస్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లహాం కుటుంబం చిత్రాలతో బంపర్ హిట్లు అందుకున్న ఈ యువనటి జాక్ పాట్ కొట్టినట్టేనన్న చర్చ సాగుతోంది. హీరోలతో సత్సంబంధాలు లేకపోతే అరుదైన అవకాశాలు ఛేజారుతాయనడానికి ఇది ఒక ఉదాహరణ. అయితే అదే సమయంలో మరో ప్రతిభావనికి ఆ అవకాశం దక్కింది. అయితే దీనిపై ఇంకా అధికారికంగా చిత్రబృందం ధృవీకరించాల్సి ఉంది. పాన్ ఇండియాలో బిగ్ ప్లానింగ్ తో తెరకెక్కుతున్న ఈ సీక్వెల్/ ప్రీక్వెల్ సినిమాకి సంబంధించిన అధికారిక అప్ డేట్స్ ఇకపై విడుదల కానున్నాయని సమాచారం

## డిసెంబర్ 4న ఆర్య 'హలో కాదల్' విడుదల..

### ఆసక్తి రేపుతున్న టీజర్




తమిళ నటుడు ఆర్య కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హలో కాదల్'. ఆర్య కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో నిఖిలా విమల్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.విడుదల తేదీ ప్రకటనతో పాటు మేకర్స్ ఒక ఆసక్తికరమైన టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. విమానంలో నిఖిలా విమల్, వైష్ణవి చైతన్య సంభాషించుకుంటున్న దృశ్యంతో ఈ టీజర్ ప్రారంభమవుతుంది. వైష్ణవి తన ప్రేమకథ గురించి వివరిస్తుండగా, అందులో ఆర్య కనిపిస్తారు. అయితే, తన భర్తతో తనకున్న ప్రేమకథ అంతకంటే ఆసక్తికరంగా ఉంటుందని నిఖిల చెబుతుంది. ఆమె భర్త పాత్రలో కూడా ఆర్యనే కనిపించడంతో కథలో ఏదో వైవిధ్యమైన మలుపు ఉందని స్పష్టమవుతోంది.మలయాళంలో విజయవంతమైన 'ప్రణయ విలాసం' చిత్రానికి దర్శకత్వం వహించిన నిఖిల్ మురళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తుండగా, జీవా శంకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్ నెలలోనే పూర్తికాగా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆర్య, సాయేషా తమ సొంత నిర్మాణ సంస్థ 'ది షో పీపుల్' బ్యానర్‌పై కిషోర్ టితో కలిసి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## ఊటీలో కీలక షెడ్యూల్ ప్రారంభం

విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా తాజా షెడ్యూల్‌ను చిత్ర బృందం ఊటీలో ప్రారంభించింది. సుందరమైన ప్రకృతి అందాల నడుమ ఈ షెడ్యూల్ జరగనుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి, అజయ్ ఘోష్, ఉపేంద్ర లిమాయే సహా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో రెండు అద్భుతమైన పాటలతో పాటు కథలో కీలకమైన పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఊటీలోని ప్రకృతి అందాలు ఈ సన్నివేశాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి విజయవంతమైన కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## "ఆలోచనలు మారుతూ ఉంటాయి"..

### డేటింగ్ వ్యాఖ్యలపై శోభిత ధూళిపాళ్ల వివరణ!

నటుడితో డేటింగ్ చేయనని గతంలో చేసిన వ్యాఖ్యలపై నటి శోభిత ధూళిపాళ్ల స్పందించింది. అప్పట్లో తన ఆలోచనలు వేరుగా ఉండటంతో అలా చెప్పానని తెలిపింది. వయసు పెరిగే కొద్దీ ఆలోచనలు మారుతుంటాయని చెప్పింది. పరిస్థితులకు అనుగుణంగా అభిప్రాయాలు మార్చుకోవడంలో తప్పులేదని అభిప్రాయపడింది.
ప్రేమంటే కేవలం రొమాన్స్ మాత్రమే కాదని శోభిత పేర్కొంది. అది ఇద్దరి మనసుల కలయిక అని వివరించింది. ఎప్పుడూ ఒకేలా ఆలోచించడం కంటే మార్పును స్వీకరించడం ముఖ్యమని అభిప్రాయపడింది.వ్యక్తిగత జీవితంపై వచ్చే వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకూడదని శోభిత సూచించింది. సమాజంలో అభిప్రాయాలు మారుతుంటాయని, వాటిని పట్టించుకుంటూ పోతే మనల్ని మనం కోల్పోయే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. మన వ్యక్తిత్వంపై స్పష్టతతో ఉండాలని చెప్పింది. శోభిత, నాగచైతన్య 2024లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.